విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

శుక్రవారం 5 జులై 2024 | 8 పేజీలు

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు దేశభక్తి ఎనలేనిది

– జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు

విశాలాంధ్ర -తిరుపతి : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు దేశభక్తి ఎనలేనిదని వారి జయంతి జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, స్థానిక ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి మహోత్సవ సందర్భంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, స్థానిక ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, జెసి ధ్యానచంద్ర, తిరుపతి మునిసిపల్ కమిషనర్ అదితి సింగ్, అధికారులతో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, పుష్పాంజలి ఘటించారు.

2

విద్యాసంస్థల బంద్ విజయవంతం

- ఎన్‌టిఏ సంస్థను రద్దు చేయాలి
- నీట్ పరీక్ష రద్దుకు కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం పోరాటంచేయాలి

- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాచేయాలి
- ఏఐఎస్‌ఎఫ్ చిత్తూరు జిల్లా కన్వీనర్ ప్రవీణ్ కుమార్

విశాలాంధ్ర -తిరుపతి : ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తిరుపతిలో విద్యాసంస్థల బంద్ విజయవంతం నీట్ పరీక్షను రద్దు చేయాలని ఈరోజు ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ తిరుపతి నగరంలో విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, ఎన్ఎస్ యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి ఆది, యూనివర్సిటీ నాయకుడు చిన్న , ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలలో ఒక్కొక్క విద్యార్థి నుండి 30 లక్షల రూపాయలు వసూలు చేసి పేపర్ లీకేజ్ చేశామని బహిరంగంగా చెప్పినా కేంద్ర ప్రభుత్వం వారిపైన చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా చేస్తున్నారన్నారు. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలు నీట్ పరీక్షను రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మాణ ప్రవేశపెట్టారు. కానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీట్ పరీక్ష పైన ఏమాత్రం కూడా మాట్లాడడం లేదన్నారు. తక్షణమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నీట్ పరీక్ష రద్దు చేయాలని కేంద్రపై పోరాటం చేయాలని తెలిపారు. నీట్ పరీక్షను నిర్వహించిన ఎన్ టి ఏ సంస్థను తక్షణమే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేందర్ ప్రధాన్ రాజీనామా చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైద్య విద్యతో వ్యా పారం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకొని పేద మధ్య బడుగు బలహీన వర్గాల విద్యార్థు లకు వైద్య విద్యను దూరం చేసేటువంటి పద్ధతులలో పేపర్ లీకేజీలు చేస్తున్న ఆ పరీక్షను

2

విశాలాంధ్ర - చిత్తూరు : నీట్,యూజీసీ నెట్ పేపర్ లీకేజీల నిర్లక్ష్యానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని దేశవ్యాప్త విద్యాసంస్థలు బంద్ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చిత్తూరులో విజయవంతంగా ముగిసింది అని ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా కన్వీనర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య విద్యతో వ్యాపారం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకొని పేద మధ్య బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేటువంటి పద్ధతులలో పేపర్ లీకేజీలు చేస్తున్న ఆ పరీక్షను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు తక్షణమే నీట్ పరీక్షను రద్దు చేస్తూ నీట్ పరీక్ష నిర్వహించిన ఎన్టిఏ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందని తీవ్రమైన అవకతవకలు, వ్యత్యాశాలతో, భాధ్యతారాహిత్యంతో పరీక్షలు నిర్వహించారు. నీట్ పరీక్షా లీకేజ్ తెరవెనుక కుంభకోణం, నీట్ స్కామ్ పై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.దేశంలో విద్య ప్రజాస్వామ్యం పై దాడికి వ్యతిరేకంగా జులై 4న తేదీన దేశ వ్యాప్తంగా కేజీ నుండి పీజీ విద్యా సంస్థల బంద్ విజయవంతంగా జరిగింది. ఎన్డీఏ వ్యవస్థను రద్దు చేయాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని, ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని,నీట్ పరీక్షా విధానాన్ని రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలి డిమాండ్ చేశారు.

2

విద్యాసంస్థల దగ్గర పొగాకు ఉత్పత్తుల అమ్మకాలపై

కఠిన చర్యలు

– జిల్లా ఎస్పీ మణికంత చందోలు

విశాలాంధ్ర - చిత్తూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం యొక్క మార్గనిర్దేశంలో చిత్తూరు జిల్లా పోలీసులు బహిరంగ ప్రదేశంలో ధూమ పానం చేసే వారిపై విద్యా సంస్థలకి 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.సిగరెట్లు ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం ప్రభావవంతంగా అమలు చేయడానికై, జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం ఎన్సిటిపి రాష్ట్ర ప్రజా ఆరోగ్య శాఖ సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ వారి సహకారంతో జిల్లాలోని పోలీసు అధికారులకి చిత్తూరు లోని జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్ నందు కాన్ఫరెన్స్ హాల్లో సమగ్ర శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం లో పొగాకుకు వ్యతిరేకంగా పోరాడటంలో వారి నిబద్ధతకు నిదర్శనంగా పోలీసు అధికారులందరూ పొగాకుకు వ్యతిరేకంగా పోరాడుతామని ప్రమాణం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పొగాకు సంబంధిత వ్యాధుల కారణంగా మన రాష్ట్రంలో ప్రతి సంవత్సరం సుమారు 48 వేల మరణాలు సంభవిస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. కోప్టా పైన నిర్వహించిన ఈ శిక్షణా తరగతులు పోలీసు అధికారులకు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో సహాయపడుతుందన్నారు. కోప్టా చట్టం లోని సెక్షన్ 6 (బి) ప్రకారం విద్యాసంస్థలకి 100 యార్డులు 300 ఫీట్ల పరిధిలో పొగాకు విక్రయించడం నిషేధం అని తెలిపారు. పెద్ద వయస్కుల వారు పొగాకు వ్యసనపు విషపు కోరల్లో చిక్కుకున్నప్పటికీని, పిల్లల్ని పొగాకు వ్యసనపరులు కాకుండా రక్షించడం,వాళ్ళని పొగాకు ఉత్పత్తులకు అలవాటు కాకుండా

2లో

హాస్టల్ సమస్యలు

పరిష్కరించాలి

– విద్యార్థినులు ధర్నా

విశాలాంధ్ర -తిరుపతి : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రిమిసెస్ 2 హాస్టల్స్ వసతి గృహంలో విద్యార్థినీలు బుధవారం సాయంత్రం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు మాట్లాడుతూ హాస్టల్లో పలు రకాల సమస్యలతో దాదాపుగా రెండు సంవత్సరాలుగా ఇబ్బందికరమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడ్డాయని వాపోయారు. హాస్టల్ లో కనీస వసతులు కూడా సరిగా లేవని, శానిటేషన్, క్లీనింగ్ అసలు సరిగా పట్టించుకోవడంలేదని, హాస్టల్ వార్డెన్ను కనీసం వారానికి ఒకసారి కాదు కదా మూడు నెలలకు ఒకసారి కూడా హాస్టల్లో పర్యవేక్షించడానికి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

2

పట్టుగూళ్ల ఉత్పత్తి పెంచేందుకు

చర్యలు చేపట్టండి : కలెక్టర్

విశాలాంధ్ర - పలమనేరు : పలమనేరు ప్రాంతీయ వైద్య శాలకు అవసరమైన అత్యవసర వస్తువులను ఆరోగ్య శ్రీ నందు కొనుగోలు చేయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ ను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం పలమనేరులోని ప్రాంతీయ వైద్య శాలను డి సి హెచ్ ఎస్ రాజశేఖర్ రెడ్డి తో కలసి ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాంతీయ వైద్యశాలకు అవసరమైన ల్యాబ్ రీఏజెంట్స్ , అత్యవసర మందులు, వస్తువులను ఆరోగ్యశ్రీ నిధుల నుండి కొనుగోలు చేయాలని, డిప్యుటేషన్ పై వెళ్ళిన వైద్య సిబ్బందిని వెనక్కు తీసుకురావాలని ఆదేశించారు. నవజాత శిశువులకు అవసరమగు వార్మర్స్ కొనుగోలు చేయుటకు, ఆపరేషన్ థియేటర్ లో అవసరమైన బాయిల్స్ ఆపరేటర్స్ కొనుగోలుకు కలెక్టర్ నిధుల నుండి రూ.2 లక్షలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు.

2లో

అల్లూరి సీతారామరాజు దేశభక్తి ఎనలేనిది

(మొదటి పేజీ తరువాయి) మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు మహనీయుని దేశభక్తి ఎనలేనిదని, వారి గొప్పదనాన్ని అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా పలువురు పుష్పాంజలి ఘటించి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇంఛార్జి అధికారి చంద్ర శేఖర్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం

నీట్ పరీక్ష రద్దుకు కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం పోరాటంచేయాలి:

(మొదటి పేజీ తరువాయి) కేంద్ర ప్రభుత్వం రద్దు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు తక్షణమే నీట్ పరీక్షను రద్దు చేస్తూ నీట్ పరీక్ష నిర్వహించిన ఎన్టిఏ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు నగర ఐఎస్ఎఫ్ అధ్యక్షుడు హరి కృష్ణ , యునివర్సిటీ అగ్రనైజింగ్ సెక్రటరీ చంద్ర , ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరేంద్ర ,యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాచేయాలి:

(మొదటి పేజీ తరువాయి) నీట్ పరీక్ష నిర్వహించే విధులు రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సురేష్,రోహిత్ విద్యార్థులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి) నిరోధించడం మన కర్తవ్యం అని తెలిపారు.ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఏపీ పోలీసుల నిబద్ధతను అభినందిస్తూ, డాక్టర్ విజయానంద్ రెడ్డి, క్యాన్సర్ స్పెషలిస్ట్ డైరెక్టర్, అపోలో క్యాన్సర్ హాస్పిటల్, హైదరాబాద్ మరియు వాయిస్ ఆఫ్ టొబాకో విక్టిమ్స్ ప్యాట్రన్ మాట్లాడుతూ, 90 శాతం నోటి ఊపిరితిత్తుల క్యాన్సర్లు నేరుగా పొగాకు ఉత్పత్తుల వాడకం వల్లనే కారణం అవుతున్నాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పొగాకు వాడకాన్ని అరికట్టడంలో రాష్ట్రంలోని వైద్యులందరూ చేస్తున్న సమిష్టి కృషి కంటే పోలీసులు అమలు చేసే నివారణ చర్యలు ఎక్కువమంది ప్రాణాలను రక్షించగలవని ఆయన వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 20 శాతం పెద్దలు 15 సంవత్సరముల పైబడిన వాళ్లు ఏదో ఒక రూపంలో పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. ఆశ్చర్యకరంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సగటున రోజుకి 250 కంటే ఎక్కువ మంది పిల్లలు పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని ప్రారంభిస్తున్నారు కాగా భారతదేశంలో సగటున రోజుకి 5,500 మంది పిల్లలు ప్రతిరోజు పొగాకు వాడకాన్ని ప్రారంభిస్తున్నారు. వీరిలో ఎక్కువమంది వాటికి బానిసలుగా మారుతున్నారని తెలిపారు. అంతేకాకుండా జువైనల్ జస్టిస్ చట్టంలోని సెక్షన్ 77 ప్రకారం ఎవరైనా మత్తు కలిగించే పదార్థాలు లేదా మద్యం లేదా పొగాకు ఉత్పత్తులు లేదా సైకోట్రోపిక్ పదార్థాన్ని కలిగిన ఉత్పత్తులని తగిన అర్హత కలిగిన వైద్యుల ఆదేశానుసారం తప్ప ఇంకా ఏ ఇతర సందర్భాల్లోనైనా పిల్లలకు ఇచ్చిన లేదా ఇవ్వడానికి కారణమైనా వారికి ఏడేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధించబడుతుంది మరియు లక్ష రూపాయల వరకు జరిమానా కూడా విధించబడుతుంది. ఈ ప్రయత్నాలకు అనుగుణంగా ఎస్పీ చిత్తూరు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో నో స్మోకింగ్ బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కాట్పా చట్టం లోని సెక్షన్ -4 ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్.ఆరిఫుల్లా, డి.టి.సి. సి.ఎస్పీ శ్రావణ్ కుమార్, సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ మేనేజర్ ప్రమోద్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.ప్రభావతి దేవి, జిల్లా లోని ఇన్స్పెక్టర్లు, ఎస్..ఐ. లు పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి) కానీ పనిచేస్తున్న సిబ్బంది వసతులు నాణ్యమైన ఆహారం అందిస్తు న్నారా లేదా గమనించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే హాస్టల్ సమస్యల పరిష్కరించేంతవరకు ధర్నా నిర్వహించుకోవాలని సాయంత్రం 8 గంటల నుంచి రాత్రి 11:45 వరకు కూడా ధర్నా నిర్వహిస్తూనే ఉన్నారు ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో వర్షం పడుతున్న మహిళ విద్యార్థినిలు ధర్నా నిర్వహిస్తున్నారు. వీరికి మద్దతుగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పి డి ఎస్ యు, ఎన్ ఎస్ యు ఐ, ఏబీవీపీ, అఖిల విద్యార్థి సంఘాల నాయకులు తమ మద్దతును తెలిపారు. ఎస్ వి యు ఇన్చార్జి రిజిస్ట్రార్ బి.చంద్రయ్య విద్యార్థుల సమస్యలు రెండు రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

పట్టుగూళ్ల ఉత్పత్తి పెంచేందుకు చర్యలు చేపట్టండి

(మొదటి పేజీ తరువాయి) వైద్యశాలలో దయాలసిస్ సెంటర్ ఉండాలని సూచించారు. వైద్యశాల ఆవరణలో పారిశుద్ధ్యం, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చిన్న పిల్లల డాక్టర్, ఎముకల డాక్టర్, చర్మవ్యాధి నిపుణులు, జనరల్ ఫిజీషియన్, రేడియాలజిస్ట్ ల కొరత విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. మమతారాణి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ అంశం ను పరిశీలిస్తామని తెలిపారు కలెక్టర్..ఈ కార్యక్రమం లో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మమతా రాణి, వైద్యులు,ఇతర సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు. పట్టు గూళ్ల ఉత్పత్తి కేంద్రం ను పరిశీలించిన జిల్లా కలెక్టర్.అనంతరం పట్టు గూళ్ల ఉత్పత్తి కేంద్రం ను కలెక్టర్ పరిశీలించి రైతులు, రీలర్లతో చర్చించి పట్టుగూళ్ల ఉత్పత్తి ప్రక్రియను, పట్టుదారము ధరలను అడిగి తెలుసుకున్నారు. పట్టుగూళ్ల ఉత్పత్తి పెంచుటకు అవసరమైన సదుపాయాలను రైతులు, రీలర్ లను అడిగారు. పట్టుగూళ్ళ దిగుబడి పెంచుటకు అవసరమైన చర్యలు చేపట్టాలని పట్టుపరిశ్రమ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమల శాఖ జేడి శోభా రాణి, ఏడి కిషోర్ నాయక్, గ్రైనేజ్ ఇంచార్జ్ నగేష్ , పట్టు గూళ్ళ విక్రయకేంద్ర అధికారి అనిల్ కుమార్, మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో

వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

విశాలాంధ్ర -తిరుపతి : శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జూలై 10 నుండి 12వ తేదీ వరకు జరగనున్న సాక్షాత్కార వైభవోత్సవాలను పురస్కరించుకుని గురువారం వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఈ సందర్భంగా తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహించారు. ఉదయం 6.30 నుండి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. మధ్యాహ్నం 12.30 గంటల నుండి భక్తులను దర్శనానికి అనుమతించారు.సాక్షాత్కార వైభవోత్సవాల్లో భాగంగా మూడు రోజులపాటు ఉదయం 10 నుండి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. జూలై 10న పెద్దశేష వాహనం, జూలై 11న హనుమంత వాహనం, జూలై 12న గరుడ వాహనంపై స్వామివారు రాత్రి 7 నుండి 8 గంటల వరకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించనున్నారు.ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, టెంపుల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తుమ్మలగుంట పాఠశాల భవనంలో చోరీ

- పోలీసులకు ఫిర్యాదు

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట చెరువులో నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనంలో చోరీ జరిగిందని ప్రధానోపాధ్యాయులు తెలియజేయడంతో గురువారం టీడీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకరరెడ్డి అక్కడికి చేరుకొని పరిశీలించారు. అసలు చెరువులో భవనం ఎవరు నిర్మించ మన్నారని, భవిష్యత్తులో తుమ్మలగుంట చెరువు, చెరువుగా ఏర్పాటు చేసేందుకు టిడిపి ప్రభుత్వం కృషి చేస్తుందని, అలాంటప్పుడు ఇక్కడ సచివాలయం, సమావేశ మందిరం, పాఠశాల భవనాలు ఉంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు. అనంతరం దొంగతనానికి సంబంధించి ఎంఆర్ పల్లి పోలీసులకు ఆయన ఫోన్ చేసి వివరాలు తెలియజేశారు. పోలీసులు హుటాహుటిన తుమ్మలగుంట చెరువుల నిర్మిస్తున్న పాఠశాల భవనం వరకు చేరుకున్నారు. దొంగతనం జరిగిన ప్రదేశాలను గుర్తించి, ఇక్కడ చుట్టుపక్కల వారిని విచారించి చర్యలు తీసుకుంటా మని తెలియజేశారు.ఈ సందర్భంగా దొడ్ల కరుణాకరరెడ్డి పోలీసులతో మాట్లాడుతూ ఈ ప్రాం తంలో ఎక్కువగా ఆకతాయిలు మద్యం సేవించడం,సిగరెట్లు కాల్చడం లాంటి పనులు చేస్తున్నారని అనునిత్యం పోలీసులు ఇక్కడ గస్తీ తిరగాలని తెలిపారు.కొంతమంది యువకులు ఇక్కడ సాయంత్రం అయితే పెద్దగా కేకలు వేస్తూ బూతులు మాట్లాడుతూ పలువురుని ఇబ్బందులకు గురి చేస్తున్నా రని,ఈ దారి గుండా వెళ్లాలన్న ప్రజలు ఇబ్బందులకు గురి అవుతు న్నారని ఆయన వాపోయారు .మందు బాబులు, గంజాయి బ్యాచ్ ఆగడాల అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు.దొంగతనాలపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని పాఠశాల ఉపాధ్యాయులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాధా రాయల్, చంగ్రామానాయుడు, భాస్కర్ రెడ్డి, మణి,పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

9న శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

విశాలాంధ్ర - తిరుమల : తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జూలై 9 వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. జూలై 16వ తేదీన ఆణివార ఆస్థానం సందర్భంగా ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవా యితీ. సాధారణంగా సంవత్సరంలో నాలుగు సార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని నిర్వహించడం ఆనవా యితీ. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళ వారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే తిరుమంజనం కార్యక్రమం సుమారు 5 గంటలపాటు కొనసాగనుంది. తిరుమంజనం కార్యక్రమం అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు ఆలయ అర్చకులు ఆగమోక్తంగా పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు.అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. తిరుమం జనం కారణంగా మంగళవారంనాడు నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది.ఈ కార్యక్రమంలో టీటీడీ ఉన్నతాధికారులు మరియు సిబ్బంది పాల్గొంటారు.

గ్రామ సమాఖ్యల బలోపేతానికి చర్యలు



విశాలాంధ్ర -చిత్తూరు : మండలంలోని గ్రామ సమాఖ్యల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు నరోత్తమ రెడ్డి అన్నారు గురువారం స్థానిక ఐకెపి భవనంలో గ్రామ సమాఖ్య సభ్యుల సర్వసభ్య సమావేశం జరిగింది మండలంలో 32 గ్రామ సమాఖ్యలు ఉన్నాయని దసలవారీగా సమావేశాలు ఏర్పాటు చేసి నూతన నాయకత్వాన్ని ఎంపిక చేస్తున్నట్లు ఆయన తెలిపారు గ్రామ సమాఖ్యల నూతన నాయకత్వాన్ని ఎంపిక చేసిన తర్వాత మండల సమైక్యలను నూతన కార్యవర్గం ఏర్పాటు అవుతుం దన్నారు. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సజావుగా తెలుస్తూ వేరొకరికి తోడ్పాటు ఇవ్వాలని ఆయన గ్రామ సమాఖ్య సభ్యులకు తెలిపారు ఈ కార్యక్రమంలో సిసి మునిరత్నం గ్రామ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు

విద్యాసంస్థల బంద్ విజయవంతం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: దేశ వ్యాప్తంగా నీట్, యూజీసీ నెట్ ను రద్దు చేయాలని డిమాండు చేస్తూ విద్యార్థి సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ పిలుపు మేరకు శ్రీకాళహస్తిలో గురువారం ఏఐఎస్ఎఫ్, పీడీఎస్ యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయవంతం అయింది. పట్టణంలోని ప్రైవేటు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. శ్రీకాళహస్తి బాలుర ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలతో పాటు పలు ప్రభుత్వ విద్యాసంస్థలను విద్యార్థి సంఘ నాయకులు బంద్ చేయించారు. అనంతరం పీడీఎస్ యూ రాష్ట్ర కోశాధికారి కార్యదర్శి ఎస్.జాకీర్, ఏఐఎస్ఎఫ్ ఏరియా కార్యదర్శి చందు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా నీట్, నెట్ ను రద్దు చేయాలన్నారు. నీట్ పరీక్షా ఫలితాల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. జాతీయస్థాయిలో పరీక్షలు నిర్వహిస్తున్నటువంటి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా విశ్వవిద్యాల యాల్లో భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడాలని... ప్రభుత్వ పాఠశాల విలీనాన్ని ఆపాలని జీవో నెంబరు: 84, 85, 117 రద్దు చేయాలని డిమాండు చేశారు. శ్రీకాళహస్తి జూనియర్ కళాశాల నుంచి గవర్నమెంట్ హాస్పిటల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు. రిజ్వాన్. షకీల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి మోహన్ రంగా జయంతి వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: వంగవీటి మోహన రంగా జయంతి వేడుకలు గురువారం శ్రీకాళహస్తిలో శ్రీకృష్ణదేవరాయల బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వంగవీటి మోహన్ రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. వంగవీటి మోహన్ రంగా ఆశయ సాధనకు బలిజలందరూ పని చేయాలని ఈ సందర్భంగా ఆ సంఘం నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మ కర్తల మండలి మాజీ అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, ఉప్పు కిష్టయ్య, గాజుల సత్యనారాయణ, పూల కృష్ణమూర్తి, స్వర్ణమూర్తి, అంజూరు వెంకటేష్ బాబు, సూరవారి రమేష్, పూడి రవి, దివి నారాయణ, పగడాల రాజు, కంఠా ఉదయ్ కుమార్, ఉత్తరాది శరవణ్ కుమార్, శ్రీవారి సురేష్, గరికపాటి చంద్ర, కొట్టె నరేష్, లీలా కుమార్, మొగరాల గణేష్, పత్తి మణి, రవి, మందల బాలాజీ, బుల్లెట్ జైశ్యామ్, అంజూరు కృష్ణ, అంజూరు రాజా, వల్లం గోపి, రూపేష్, తీగల భాను, గోపాల్, వెంకట్రామయ్య, చింతామణి యానాది, ముత్యాల కృష్ణ, సురేష్ మేస్త్రి, గంగాధరం, మునికృష్ణ, కృష్ణయ్య, షణ్ముగం, ధనంజయులు, ఉప్పు రాజేష్, బుగ్గ హరి, మున్నా, బాలు, సూర్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

విశాలాంధ్ర - పాకాల : స్థానిక పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం చరిత్ర విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ మొహిద్దీన్ భాష అధ్యక్షతన స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు . బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సీతారామరాజు చేసిన పోరాటాన్ని గురించి ప్రిన్సిపాల్ విద్యార్థులకు వివరించారు. బ్రిటిష్ వారిని ఎదురు పోరాడిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని బ్రిటిష్ వారిని గడగడలాడించిన సీతారామరాజు తెలుగువాడు కావడం తెలుగు జాతికి గర్వకారణం అన్నారు . విశాఖ మన్యంలో జరిగిన రంప తిరుగుబాటులో అల్లూరి సీతారామరాజుదే కీలక పాత్ర అని తెలిపారు. సీతారామరాజు ధైర్యసాహసాలు, లక్ష్య సాధనలో ఆయన చూపిన తెగువను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సురేంద్ర అధ్యాపకులు రమేష్ కుమార్, ఈశ్వర బాబు, రవి , లక్ష్మీ ప్రసాద్, వినోద్, మాధవి ,రమణమ్మ విష్ణు ప్రియ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పిస్తాం : ఏపీఓ

విశాలాంధ్ర- కార్వేటినగరం : జాతీయ ఉపాధి హామీ పథకంలో పులి అందరికీ వంద రోజులు పనులు కల్పిస్తామని ఏపీఓ జాహ్నవి అన్నారు. గురువారం కార్వేటిన గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరంలో ఏర్పాటు చేసిన గ్రామసభకు సర్పంచ్ ధనంజయ వర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ జాబ్ కార్డులు ఉన్న వారందరకి వంద రోజులు పనులు కల్పిస్తామన్నారు. అనంతరం సర్పంచ్ ధనంజయ వర్మ మాట్లాడుతూ కుమ్మరగుంట వద్ద సప్లై ఛానల్, అదేవిధంగా బంగ్లా చెరువు నుండి కార్వేటినగరం చెరువుకు వెళ్లే కాలువను ఉపాధి హామీ పథకంలో పనులు చేపట్టాలని ఏపీవో జాహ్నవిని కోరారు. కాలువ పనులు చేస్తే నీళ్లు చెరువులోకి సులభంగా వెళుతుందని పేర్కొన్నారు. అలాగే అక్కడక్కడ డ్రైనేజ్ కాలువలు దెబ్బ తిన్నచోట మరమ్మత్తులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఏవో హేమలత మాట్లాడుతూ రైతులకు వేరుశనగ బస్తాలు, జనుములు సబ్సిడీ ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కొత్త ప్రభుత్వంలో రైతు భరోసా గురించి ఇంకా వివరాలు రాలేదని సూచించారు. తాగునీటిని కాంచి చల్లార్చి తాగాలని, అదేవిధంగా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని వైద్య పర్యవేక్షకులు త్యాగు తెలియజేశారు. ఎంఈఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులం దరూ ప్రభుత్వ బడులల్లో చేర్పించేలా చూడాలని ప్రజాప్రతిని ధులు,విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ

చూపాలన్నారు.ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివి సీఎం స్థాయి వరకు వివరిం చారు. పంచాయతీకి సంబంధించిన నిధులు ఈవో మణి చదివి వినిపించారు. కొందరు లబ్ధిదారులు అర్జీలు సమర్పించారు. విద్యుత్ సమస్యలు ఎక్కువ ఉందని పలువురు గ్రామసభ దృష్టికి తీసుకొచ్చారు. ఈవో స్పందించి వచ్చే గ్రామసభలోపు విద్యుత్ సమస్య తీరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు సిబ్బంది,సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగబాబును కలిసిన జనసేన నాయకులు

విశాలాంధ్ర - పుంగనూరు: జనసేన జిల్లా కార్యదర్శి పగడాల రమణ ఆధ్వర్యంలో నియోజవర్గ పరిధిలోని మండల అధ్యక్షులు అర్బన్ అధ్యక్షులు అందరూ విజయవాడలోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబును కలవడం జరిగింది నియోజవర్గంలో పార్టీ పరిస్థితులపై ఆయనకు క్షుణ్ణంగా వివరించడం జరిగింది అంతేగాక నియోజకవర్గ పరిధిలో 2009 నుండి పార్టీని కాపాడుకొని క్యాడర్‌ను అంటిపెట్టుకొని ఉంటూ అది నాయకుడు కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశించిన అన్ని కార్యక్రమాలను నియోజవర్గంలో చేపడుతున్న పగడాల రమణను నియోజకవర్గ ఇన్చార్జిగా నియమించాలని తద్వారా పార్టీ బలోపేతం కావడం జరుగుతుందని నియోజకవర్గం నుండి వెళ్లిన అన్ని మండల అధ్యక్షులు ఒకే అభిప్రాయం నాగబాబుకు తెలియజేయడం జరిగింది. నాగబాబు మాట్లాడుతూ అతి త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలకు పార్టీ నాయకుల అభిప్రాయం మేరకు ఇన్చార్జిలనునియమించడం జరుగుతుందని ఆయన తెలియజేశారన్నారు అదేవిధంగా జనసేన పార్టీ తరపున నూతనఎమ్మెల్సీగా ఎన్నికైన హరిప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందన్నారు. పార్టీ గొంతు ప్రజా సమస్యల పట్ల శాసనమండలిలో పోరాటం చేయాలని ఆయనకు సూచించడం జరిగింది అన్నారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విరుపాక్షి పట్టణ పార్టీ అధ్యక్షులు నరేష్ రాయల్ ప్రోగ్రాం కార్యదర్శి చైతన్య రాయల్ రూరల్ ప్రధాన కార్యదర్శి హరినాయక్ ఐటీ ఇంచార్జ్ దేశాది వికాస్ కార్యదర్శి బాలాజీ నాయక్ మరియు ఇతర మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

సిడి కండిగ సచివాలయానికి సీఎం, డిప్యూటీ సీఎం ఫోటోలు వితరణ

విశాలాంధ్ర - కార్వేటినగరం : మండల పరిధిలోని సిడి కండిగ సచివాలయానికి టిడిపి నాయకులు దాసరి గణేష్, శ్రీనివాసులు యాదవ్ లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫోటోలను సచివాలయానికి వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం ఇక అభివృద్ధిలో పరుగులు తీస్తుందని ప్రజ లంతా కూటమి వైపు నమ్మి అత్యధిక ఎమ్మెల్యే స్థానాలను గెలిపించడం సంతోషదాయకమన్నారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చంద్రయ్య,, గోవిం దస్వామి తదితరులు పాల్గొన్నారు.

మాడవీధుల్లో ఫ్లెక్సీలు కడితే జరిమానా

-కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి పట్టణంలోని మాడవీధులు (తేరువీధి, నెహ్రూవీధి, నగరివీధి, బజారువీధి)లో రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు కడితే రూ.1,000 జరిమానా విధిస్తామని పురపాలక సంఘం కమిషనరు ముప్పాళ్ల రమేష్ బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాడవీధులలతో సాటు దిగువ సన్నిధివీధి, ఎగువ సన్నిధివీధి, టూరిస్టు బస్టాండు వరకు ఎలాంటి రాజకీయ పార్టీల బ్యానర్లు, కటౌట్లు ఏర్పాటు చేయకూడదన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి ఈ నిబంధన విధిస్తున్నట్లు ఆయన తెలిపారు. శ్రీకాళహస్తి క్షేత్ర పవిత్రతను కాపాడటానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. పట్టణ వాసులు అందరూ ఇందుకు సహకరించాలని రమేష్ బాబు కోరారు.

భక్తులకు అన్నదానం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణ శివారులోని భరద్వాజ తీర్థంలో గురువారం నరసింహస్వామి సన్నిధిలో భక్తులకు అన్నదానం చేశారు. శివగణం భక్త బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అవధూత సాయి అన్నపూర్ణ మాత ఆరాధన ఉత్సవం సందర్భంగా నరసింహస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అలాగే రావి చెట్టు కింద ఉన్న వినాయక స్వామికి నాగదేవతలకు స్వామికి అభిషేకాలు చేశారు. ఉసిరి చెట్టు కింద ఉన్న శివునికి నందీశ్వరునికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి శివగణం భక్త బృందంచే ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాళహస్తి క్షేత్ర స్థల పురాణం గురించి డాక్టర్ నగరి చాముండేశ్వం రావుచే ప్రవచనం జరిగింది. సుమారు 200 మంది భక్తులు ఈ కార్యక్రమానికి విచ్చేసి అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శివగణం బృందం సిద్దులయ్య, రామలింగస్వామి, తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా

చెరువులో పాఠశాల నిర్మాణం

చెరువులో కట్టిన కట్టడాలు తొలగించండి - భవిష్యత్తులో ముప్పు వాటిల్లకుండా చూడండి

- టీడీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్ రెడ్డి

విశాలాంధ్ర - తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట చెరువులో నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల భవనం నిర్మిస్తుండడంతో తెలుగుదేశం పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనంలో దొంగతనం జరిగిందని ప్రధానోపాధ్యా యులు తెలియజేసే యడంతో ఆయన అక్కడికి చేరుకొని పరిశీలించారు. అసలు చెరువులో భవనం ఎవరు నిర్మించమన్నారని,భవిష్యత్తులో తుమ్మలగుంట చెరువు,చెరువుగా ఏర్పాటు చేసేందుకు టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని, అలాంటప్పుడు ఇక్కడ సచివాలయం, సమావేశ మందిరం, పాఠ శాల భవనాలు ఉంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు. చెరువు కట్టను తొలగించి చెరువు లోపల స్కూల్ నూతన భవనము,సమావేశపు మందిరం కట్టడం చట్ట విరుద్ధమని తెలిపారు. అడ్డగోలుగా చెరువులో నిర్మిస్తున్న భవనాలు రాబోయే రోజుల్లో వర్షపు నీటితో చెరువు మునిగితే ఆ ముప్పుకు బాధ్యులు ఎవరు అని ఆయన ప్రశ్నించారు. దీనిపై విచారించి ప్రజాధ నాన్ని దుర్వినియోగానికి పాల్పడ్డ అధికారులపై, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాధా రాయల్, చంగల్ రామానాయుడు,భాస్కర్ రెడ్డి,మణి, పాల్గొన్నారు.

తెగులుపై రైతులకు అవగాహన

విశాలాంధ్ర - దొరవారిసత్రం : దొరవారిసత్రం మండల పరిధిలోని గొల్లపాలెం గ్రామ సమీపంలో వేసి ఉన్న వరి పంటను మండల వ్యవసాయ అధికారి జ్యోతి మైల్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వరి పంటలలో తెగుళ్లు, పురుగుల నివారణ పై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని వేణుంబాక, ఏకొల్లు, ఉచ్చూరు, తనియాలి, పోలిరెడ్డి పాలెం, తల్లంపాడు రైతు భరోసా కేంద్రాల పరిధిలో 277 హెక్టార్ల వరి పంటను సాగు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం వరి పంట ఎన్ను తీసే దశలో ఉందన్నారు. వరి పంటలో ఆకు ముడత తెగులు, కాండం తొలిచే పురుగు ఎక్కువగా ఉన్నట్లు గమనించిన వ్యవసాయ అధికారి దాని నివారణకు కార్బన్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు ఎకరాకి పిచికారి చేయాలని సూచించారు. ఎండ తీవ్రత అధికంగా ఉందని హస్పేట్ వాడకం కూడా తగ్గించాలని అని రైతులకు తెలిపారు. చివరి దశలో యూరియా పొటాషియం ఒక ఎకరాకి 20 నుండి 25 కేజీలు వేస్తే రోగ నిరోధక శక్తి పెరిగి తెగులు బెడద ను నివారించవచ్చన్నారు. గ్రామాల్లో ఉన్న రైతులు భూపరీక్షలను నిర్వహించి దానికి అనుకూలంగా ఉండే విధంగా వ్యవసాయం చేయాలని ఆమె సూచించారు. ఎవరైనా రైతులు భూ పరీక్షలు చేయించుకోవాలనుకుంటే తమ పొలాల్లో ఉన్న మట్టిని తీసుకొని రైతు భరోసా కేంద్రాల్లో ఇవ్వాలని ఆమె తెలిపారు. అదేవిధంగా కౌలు రైతులకు కూడా కౌలు కార్డులు ఇస్తున్నామని వాటిని వినియోగించుకోవాలని ఆమె తెలిపారు.

ఆంగ్లభాష పట్ల విద్యార్థుల్లో ఆసక్తి కలిగేలా చూడాలి

విశాలాంధ్ర - పాకాల : ప్రాథమిక పాఠశాల స్థాయి నుండే విద్యార్థులలో ఆంగ్ల భాష పట్ల ఆసక్తి కలిగేలా ఉపాధ్యాయులు చూడాలని మండల విద్యాశాఖ అధికారి బాబ్జి తెలిపారు. గురువారం మండలంలోని పచ్చిపాల పల్లి,అగ్రహారం ప్రాథమిక పాఠశాలలలో బోధన విధానాన్ని ఎంఈఓ పరిశీలించారు . ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ విద్యార్థులలో ఇంగ్లీషు పట్ల ఉండే భయాన్ని తొలగించాలన్నారు.ప్రతి రోజు ఉపాధ్యాయులు కొన్ని ఆంగ్ల పదాలు ,వాక్యాలు నేర్పించాలని సూచించారు.చిన్న చిన్న ఆంగ్ల వాక్యాలు వారి దగ్గర చెప్పించాలని .గ్రామర్ పార్ట్ కూడా వారి చేత రాయించాలని పేర్కొన్నారు.ప్రతి రోజు విద్యార్థులకు ఇంటి పని కింద ఒక పాఠం లోని పదాలు,వాక్యాలు ఇచ్చి వాటిని ఏలా రాశారో పరిశీలించాలన్నారు.అదే విధంగా విద్యార్థుల చేత వర్క్ బుక్స్ రాయించాలని తెలిపారు. తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి వారి పిల్లల ప్రగతిని వారికి తెలియచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శేషాద్రి,జ్యోతి, ఉపాధ్యాయులు కేశవరావు ,సి. ఆర్. పి.శ్రీనివాసులు ,అంగన్వాడీ కార్యకర్త సరళ పాల్గొన్నారు.

వచ్చే జన్మదినం నాటికి వంగవీటిరంగా విగ్రహ ఆవిష్కరణ

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

విశాలాంధ్ర -తిరుపతి : వంగవీటి మోహన రంగా 77వ జయంతి వేడుకలు నగరంలో ఘనంగా జరిగాయి. రాధా రంగా మిత్రమం డలి, బలిజసేన ఆధ్వర్యంలో వంగవీటి మోహన రంగా జయంతి ఉత్సవం జరిగింది. గురువారం ఉదయం నగరంలోని అనంతవీధి సర్కిల్ లో రంగా చిత్రపటానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. వంగవీటి మోహన రంగా పేదల కోసం జీవితాన్ని ధారబోశారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నారు. కాపుల ఔన్నత్యాన్ని పెంచిన నాయకుడు వంగవీటి మోహన రంగా అని ఆయన చెప్పారు. కాపులే కాకుండా బడుగు, బలహీన వర్గాలతోపాటు దళితుల పక్షాన నిలిచి ప్రజల మన్న నలు పొందిన గొప్ప నాయకుడు వంగవీటి రంగా అని ఆయన చెప్పారు. పేదల ఇళ్ళ కోసం నిరాహార దీక్షకు దిగిన వంగవీటి మోహన్ రంగా 47ఏళ్ళ వయస్సులో హత్యకు గురికావడం బాధాకరమని ఆయన అన్నారు. కాపు జాతి ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన వంగవీటి మోహన రంగా విగ్రహం వచ్చే జన్మదినం నాటికి తిరుపతిలో ఆవిష్కరించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బలిజసేన అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఊక విజయ్ కుమార్, నైనార్ శ్రీనివాస్, చుక్కలదాము, యాదవ కృష్ణ, ఆముదాల తులసి, నీలాద్రి, కెవెంకే లోకేష్, బెల్లంకొండ సురేష్, పూసా మాధవ రావు, సుబ్బు యాదవ్, వినోద్ రాయల్, బిజెపి నాయకులు పొనగంటి భాస్కర్, వరప్రసాద్, నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు బుజ్జీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘం నేతలపై

అక్రమ నిర్బంధాలను ఆపాలి

విశాలాంధ్ర- సత్యవేడు: విద్యార్థి సంఘం నేతలపై అక్రమ నిర్బంధాలను ఆపాలని ఏఎస్ఎఫ్ఐ నాయకులు నాగార్జున కోరారు.కేంద్ర ప్రభుత్వ నీట్ పరీక్షల నిర్వహణపై గురువారం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన విద్యాస ంస్థల బంద్ విజయవంతమైంది.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయ కులు నాగార్జున మాట్లాడుతూ నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు.పీహెచ్డీ అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదిం చిన తప్పనిసరి నీట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఐఐటి ముంబై నుండి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు విద్యార్థి సంఘం నేతలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి అన్నారు. పైగా యూనివర్సిటీలో రాజకీయాలకు నిలయంగా మారకుండా స్వేచ్ఛ వ్యక్తీకరణ ఉండాలన్నారు. ప్రజాస్వామ్య అణిచివేత చర్యలను ఆపాల్సి ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలన్నారు.నీట్ పరీక్షల వైఫల్యాలకు బాధ్యులైన మంత్రి పదవి నుంచి తప్పుకోవాలన్నారు. అంతకు ముందు విద్యార్థి సంఘం నేతలతో కలిసి పలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తరగతులను బహిష్కరించి బంద్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు టి మురళి,పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో మహా పాలాభిషేకం

విశాలాంధ్ర - కార్వేటినగరం: బాలాజీ కాలనీలో వెలసి ఉన్న శ్రీ సద్గురు షిరిడీ సాయినాధుని ఆలయంలో మహాపా లాభిషేకం కార్యక్రమాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా స్వామి వారిని వేకువ జామును సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, అర్చన వంటి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అలాగే వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వహస్తాలతో మహాపాలాభిషేకం చేప ట్టారు. అనంతరం స్వామివారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభర ణాలతో సుందరంగా అలంకరించి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆదే విధంగా కాగడహారతి ఇచ్చారు. మహా పాలాభిషేకాన్ని పురస్కరించుకుని ఆలయ ఆవం`ణంలో భక్తులకు అన్న దాన కార్యక్రమం నిర్వహిం చారు. మొక్కులున్న భక్తులు అన్నప్రసాదాలను పంచి పెట్టారు. మండల తహసీల్దార్ పుష్పకుమారి సాయి బాబాను దర్శిం చుకుని తన స్వహ స్తాలతో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆధ్యక్షుడు బాలాజీ, ఎంపీపీ లత,కమిటీ సభ్యులు చిరంజి విరెడ్డి. రాజశేఖర్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

జీ.ఓ.నెం. 117 రద్దుచేయాలి

- ఎస్టీయు డిమాండ్

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యాభివృద్ధికి పెను విఘాతంగా మారిన జీఓ నెంబర్ 117 ను వెంటనే రద్దు చేయాలని ఎస్టీయు డిమాండ్ చేసింది. ఎస్టీయు తొట్టంబేడు మండల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్ద కనపర్తి నందు జిల్లా అధ్యక్షులు కె.రమేష్ మాట్లాడుతూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యాభివృద్ధికి పెను విఘాతంగా మారిన జీఓ నెంబర్ 117 ను వెంటనే రద్దు చేసి ప్రభుత్వ పాఠశాల లను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ సంద ర్భంగా తొట్టంబేడు మండలంలోని వివిధ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ను రాష్ట్రోపాధ్యాయ సంఘం, తిరుపతి జిల్లా, మండలనాయకులు సందర్శించి ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల సమస్యల ను సేకరించి సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు తిరుపతి జిల్లా అదనపు ప్రధానకార్యదర్శి దేవేంద్ర పెరిమిడి, జిల్లా ఉపాధ్యక్షులు తొండు కృష్ణయ్య, అసోసియేట్ అధ్యక్షులు గుమ్మడి మురళి, శ్రీకాళహస్తి డివిజన్ కన్వీనర్ శ్రీ పూడి సుధాకర్ యాదవ్, తొట్టంబేడు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయ ప్రకాష్, చంద్ర శేఖర్, జిల్లా నాయకులు గజేంద్ర, మోతీలాల్, చంద్రయ్య, బత్తెయ్య తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో ఉండగా కుప్పకూలిన ఆర్టీసీ డ్రైవర్!

విశాలాంధ్ర-పుంగనూరు: పుంగనూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న సోమల మండలం పొదలకుంట్ల పల్లి గ్రామానికి చెందిన రాఘవయ్య గురువారం డ్రైవర్‌గా విధుల్లో ఉండగా గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన భౌతిక కాయాన్ని వారి స్వగ్రామానికి తరలించడం జరిగింది. కడప జోనల్ కార్యనిర్వహణ అధికారి గిడుగు వెంకటేశ్వరరావు, చిత్తూరు జిల్లా ప్రజా రవాణా అధికారి టి.జితేంద్రనాథ్ రెడ్డి, పుంగనూర్ డిపో మేనేజర్ కే.సుధాకరయ్యలు రాఘవయ్య భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కడప జోనల్ అధికారి గిడుగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విధుల్లో ఉండగా రాఘవయ్య మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని దేవుని కోరుకుంటున్నామన్నారు ఎల్లవేళలా వారి కుటుంబానికి ఆర్టీసీ అండగా ఉంటుందన్నారు.

అల్లూరి సీతారామరాజు జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర - కార్వేటినగరం: గురువారము ఎన్ఎస్ఎస్ యూనిట్ మరియు ఇతర విభాగాల ఆధ్వర్యం లో అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహిం చిన కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థు లను ఉద్దేశించి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు యొక్క ధైర్య సాహసాలు దేశభక్తి నాయకత్వ లక్షణాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయ రెడ్డి అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను డిజిటల్ రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం ఆచారి, అధ్యాపకులు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ టి హరిబాబు, డాక్టర్ బాబు, హిస్టరీ అధ్యాపకురాలు సరిత, కార్తీక్, రాజశేఖర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌టిఏ సంస్థను రద్దు చేయాలి: ఎస్ఎఫ్ఐ

విశాలాంధ్ర - చంద్రగిరి: విద్యారంగ సమస్యలు పరిష్కరించి నీట్, నెట్ పరీక్షల లీకులకు కారకులైన ఎన్‌టిఏ సంస్థను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాలు చంద్రగిరిలో గురువారం ర్యాలీ నిర్వహించారు. భారత్ బంద్ నేపథ్యంలో తిరుపతి జిల్లా బంద్‌లో భాగంగా చంద్రగిరిలో విద్యా సంస్థలు బంద్ నిర్వహించారు. విద్యార్థులు ప్ల కార్డులు ప్రదర్శిస్తూ పురవీధుల్లో ఊరేగారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి తేజ మాట్లాడుతూ పరీక్ష రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా పాఠశాలల మూసివేత ఆపాలి, యూనివర్సిటీ కేంద్రాలలో విద్యార్థులపై అక్రమ కేసులు ఆపాలని తేజ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనివాస్ సుభాన్, హర్షద్, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లూరి విగ్రహాన్ని తిరుపతిలో ప్రతిష్టించాలని వినతి

విశాలాంధ్ర - తిరుపతి : మన్యం వీరుడు అల్లూరి సీతా రామరాజు విగ్రహాన్ని తిరుపతి నగరంలో ప్రతిష్టించాలని కోరుతూ తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కె.బాబు, నరసిం హాచారి, కార్పొరేటర్లు ఆర్.సి. మునికృష్ణ, కోటూరి ఆంజినేయులు, అనిల్ కుమార్, వరికుంట్ల నారాయణ కమిషనర్ అదితిసింగ్ కి విజ్ఞాపన పత్రం అందించారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా గురువారం తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ ని కలిసి మాట్లాడుతూ తిరుపతి నగరంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం ఇంతవరకు ప్రతిష్టించకపోవడం విచారకరమని, ఇప్పటికైనా అల్లూరి విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. కార్పొరేటర్ల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకొని, చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

మనమందరం ప్రజాసేవకులం...

- ప్రజల కోసం పని చేద్దాం
- మంచిగా పని చేసే వారిని మంచిగానే చూస్తాను
- ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే సహించను
- మండల స్థాయి అధికారులతో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సమీక్ష

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: అధికారులు, నాయకులు అందరం ప్రజాసేవకులమని, ప్రజల కోసం అందరూ కలిసికట్టుగా పని చేద్దామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తిరుపతి రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో గురువారం సమావేశమై అందరినీ పేరుపేరునా పరిచయం చేసుకున్నారు. అధికారులు ఎమ్మెల్యే పులివర్తి నానికి అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రవర్తించిన తీరును అధికారులు అందరూ మార్చుకోవాలన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు తగిన గౌరవం ఇవ్వాలని, వారిని ఇబ్బంది పెట్టకుండా వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అశ్రద్ధ చూపినా, మండల ప్రజలను ఇబ్బందులకు గురిచేసినా సహించబోమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎవరివలనైనా సమస్య తలెత్తితే తన దృష్టికి తీసుకురావచ్చు నన్నారు. ఉపాధిహామీ పనులలో పెద్ద సంఖ్యలో అవినీతి జరిగినట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, అన్ని విషయాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవడానికి అధికారులు అందరూ సహకరించాలన్నారు. నిత్యం ప్రజలలో ఉంటూ వారికి ప్రభుత్వంపైన నమ్మకం కలిగించాలన్నారు. మండల అభివృద్ధికి అందరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సాయుధ తిరుగుబాటు చేసిన విప్లవకారుడు అల్లూరి సీతారామరాజు

విశాలాంధ్ర-సత్యవేడు: తిరుపతి జిల్లా సత్యవేడు తహసిల్దార్ కార్యాలయంలో అల్లూరు సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డిటి రవిచంద్రబాబు మాట్లాడుతూ బ్రిటిష్ వలస పాలకులను తరిమి వేయడానికి గిరిజన ప్రజలను సంఘటితం చేసిన నాయకుడుగా అల్లూరి సీతారామరాజు నిలిచారన్నారు. ముఖ్యంగా బ్రిటిష్ పాలకుల అణిచివేత ధోరణితో విశాఖపట్నం, తూర్పుగోదావరి ప్రాంతాల్లోని అనగారిన గిరిజన ప్రజల జీవన విధానం అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో 1924 లో అల్లూరి సీతారామరాజును బ్రిటిష్ పాలకులు పట్టివేసి కాల్చివేశారన్నారు. ఈ క్రమంలో 1986లో అల్లూరి సీతారామరాజు స్మారక స్టాంపును ఇండియా పోస్ట్ విడుదల చేసిందన్నారు. అంతకు మునుపు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి రెవెన్యూ డిటి రవిచంద్రబాబు ఆధ్వర్యంలో సిబ్బంది పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సురేష్, జూనియర్ అసిస్టెంట్ జీవకల, వీఆర్వోలు ఇళయరాజా, రమేష్, మోహన్ రాజ్, డేటా ఎంట్రీ ఆపరేటర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలని నగరిలో బంద్

విశాలాంధ్ర-పుత్తూరు టౌన్: నీట్ పరీక్షను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలని ఏఐఎస్ఎఫ్ నగరి నియోజకవర్గం కన్వీనర్ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. నీట్, యూజీసీ నెట్ పేపర్ లీకేజీల బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని దేశవ్యాప్త విద్యాసంస్థలు బంద్ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నగరిలో విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య విద్యతో వ్యాపారం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకొని పేద మధ్య బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేటువంటి పద్ధతులతో పేపర్ లీకేజీలు చేస్తున్న ఆ పరీక్షను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే నీట్ పరీక్షను రద్దు చేస్తూ నీట్ పరీక్ష నిర్వహించిన ఎన్టిఏ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందని తీవ్రమైన అవకతవకలు, వ్యత్యాసాలతో, బాధ్యతారాహిత్యంతో పరీక్షలు నిర్వహించారన్నారు. నీట్ పరీక్షా లీకేజ్ తెరవెనుక కుంభకోణం, నీట్ స్కామ్‌పై సమగ్ర విచారణ నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్టీఏ వ్యవస్థను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష నిర్వహించే విధులు రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఐక్య విద్యార్థి సంఘాలు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నగరి పట్టణ కార్యదర్శి భాష, వీరికి సంఘీభావంగా ఏఐటియుసి నాయకులు కోదండయ్య భాష సత్తార్ శేఖర్ సిరా ఉద్దీన్ నగరి ఏఐఎస్ఎఫ్ నాయకులు రాబిన్, రోహిత్, విశాల్ ముని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణం లోని గోకుల్ సర్కిల్ నందు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుక లను పుంగనూరు రాజు క్షత్రియ సేవ సంఘం ఆధ్వర్యంలో ప్రతి యేడు నిర్వహించే విధంగా క్షత్రియ సంఘ పెద్దలు భక్తవత్సరాజు, సీత పతి రాజుల సమక్షంలో క్షత్రియ సేవ సంఘం సభ్యులు టిడిపి రాజాం పేట పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు, గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ప్రభాకర్ రాజు, చంద్ర శేఖర్ రాజు లు గోకుల్ సర్కిల్ వద్ద అల్లూరి సీతారామ రాజు చిత్ర పటానికి పూలమా లలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్షత్రియ సేవ సంఘం సభ్యులు మాట్లాడుతు బ్రిటిషర్ల గుండెల్లోకి దూసుకుపోయిన విప్లవ బాణం అల్లూరి. బ్రిటిష్ సామ్రాజ్యపు పునాదులు పెళ్లగించే దుకు పుట్టిన విప్లవ వీరుడు. భారత స్వాతంత్ర్యం కోసం అసమాన పోరాటం చేసిన యోధుడు. అల్లూరి సీతారామరాజు సాయుధ పోరాటం ద్వారా మన్యం ప్రజల హక్కుల కోసం, భారత స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన యోధుడు విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు అల్లూరి వారసులే అని ఆయనను స్మరించు కొని ఘన నివాళులు అర్పించడం జరిగిందన్నారు. కార్యక్రమం అనంతరం పట్టణం గోకుల్ సర్కిల్ వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం లో హిందూ జాగరణ గౌరవ అధ్యక్షులు త్రిమూర్తిరెడ్డి, బిజెపి నాయకులు, రాజారెడ్డి,ఎస్సి మోర్చా జిల్లా అధ్యక్షులు నరసింహులు, క్షత్రియ సేవ సంఘ సభ్యులు భాస్కర్ రాజు, ప్రభాకర్ రాజు, రెడ్డెప్ప, రామకృష్ణమ రాజు, సుబ్రహ్మణ్యం రాజు,రవి, జ్యోతి రాజు, శంకర్ రాజు, సతీష్ కుమార్ రాజు, మాజీ టిడిపి కౌన్సిలర్ లక్ష్మణ రాజు, ఈశ్వర్ రాజు, సుదర్శన రాజు, శివ, శ్రీధర్ రాజు, నారాయణ రాజు, మల్లికార్జున, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో బంద్ విజయవంతం

విశాలాంధ్ర-వెంకటగిరి: నీట్ పేపర్ లీకేజ్ గాను దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు యువజన సంఘాలు బందు కు పిలుపునిచ్చాయి అందులో భాగంగా వెంకటగిరి ఏఐవైఎఫ్ మరియు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బందులో పాల్గొని స్కూళ్లు కాలేజీలు మద్దతు తీసుకొని స్వచ్ఛందంగా స్కూల్లని కాలేజీలో ముగించి బందులో విద్యార్థులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు జయకృష్ణ శివ సాయి నారయ్య అజయ్ చందు మరియు ఏఐఎస్ఎఫ్ నాయకులు పెంచలయ్య యువరాజ్ యశ్వంత్ రమేష్ తదితరులు పాల్గొని బందును విజయవంతం చేశారు.

చంద్రగిరి ఎమ్మెల్యేను కలిసిన అనీల్ రావిపూడి

విశాలాంధ్ర-తిరుపతి రూరల్ : చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని సినిమా డైరెక్టర్ అనిల్ రావిపూడి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలు అన్ని వర్గాలతోపాటు సినిమా రంగం కూడా ఇబ్బందులు పడిందన్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ అనిల్ రావిపూడి ఒక తెలుగు సినీ రచయితే గాక దర్శకుడని, ఆయన పటాస్, సుప్రీం, రాజా ది గ్రేట్, భగవద్ కేసరి పలు సూపర్ హిట్ సినిమాలను ప్రజలకు అందించి చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచారని తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

విశాలాంధ్ర - దొరవారిసత్రం: దొరవారిసత్రం మండల పరిధిలోని టపాయిండ్లు గ్రామ సమీపంలో చిల్లర దుకాణం యజమాని అంబికా మెడలో ఉన్న చైన్ ను గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు గురువారం అపహరించారు. స్థానిక వివరాలు మేరకు చెన్నై నుండి మోటార్ సైకిల్‌లో నాయుడుపేట వైపు వెళుతూ మార్గమధ్యంలో జాతీయ రహదారి వెంబడి ఉన్న చిల్లర దుకాణంలో ఆగి అక్కడ చిల్లర వస్తువులు తీసుకుంటూ యజమాని అంబికా మెడలో ఉన్న బంగారు చైను లాక్కొని గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు అక్కడ నుండి పరారయ్యారు. అపహరించిన బంగారు ఐదు సవరలు సుమారు 2 లక్షల 50 వేల రూపాయలు ఉంటుందని బాధితురాలు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న నాయుడుపేట సీఐ, ఎస్సై తిరుమలరావు సంఘటనలు చేరుకుని నిందితుల కోసం గాలింపు చర్య చేపట్టారు.

నీట్ పరీక్ష ద్వారా నష్టపోయిన విద్యార్థులకు

నష్టపరిహారం చెల్లించాలి..!

ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్ డిమాండ్

విశాలాంధ్ర-పుత్తూరు టౌన్: నీట్, నెట్ పరీక్ష పేపర్ లీకేజీను నిరసిస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో గురువారం పుత్తూరు అంబేద్కర్ సర్కిల్ వద్ద విద్యార్థులతో నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్షులు ఎ.నవీన్ కుమార్ ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు ఆర్.వెంకటేష్ ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు బి మహేష్ మాట్లాడుతూ నీట్ పరీక్ష లీకేజీ పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని, దేశ గౌరవ ప్రతిష్టలకు విశిష్టమైన నీట్ పరీక్ష దేశ చరిత్రలో కనివిని ఎరగని రీతిలో ఈ సంవత్సరం అవకతవకలు జరిగాయని ఆరోపించారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని బాధిత విద్యార్థులు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు మొరపెట్టుకున్న ఎటువంటి స్పందన లేకపోవడం దారుణమన్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ను పునరుద్ధరించవలసిన అవసరం ఉందని చెప్పారు. కానీ బాధిత విద్యార్థులకు న్యాయం చేస్తామని గాని నీటి పరీక్షను మళ్లీ నిర్వహిస్తామని చెప్పి గానీ ప్రకటన ఇవ్వక పోవడం బాధ్యత రాహిత్యం అని వారు అన్నారు. ఈ సందర్భంగా నీట్ పరీక్ష పత్రాల లీకులకు కారణమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ)ని రద్దు చేయాలని, పరీక్ష రాసి నష్టపోయిన విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నూతన విద్యా విధానం పేరిట దేశవ్యాప్తంగా పాఠశాల మూసివేత ఆపాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా పీహెచ్డీ అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షలు రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నీట్ పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని అసెంబ్లీ లో తీర్మానం చేయాలని లేకపోతే దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని, నీట్ పరీక్షలు తిరిగి నిర్వహించకపోతే అన్ని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చలో పార్లమెంట్ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దినేష్, విక్రమ్, దిలీప్, ఉదయ్, కరుణాకరన్, అభి, వర్మ, అభిషేక్ సాయికుమార్, సంతోష్, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతోనే చీడలు పెరుగుతున్నాయి

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్: ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా పంటలలో చీడలు అధికమవుతున్నాయని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ భాస్కరయ్య తెలిపారు. నారాయణవనం మండలం కొండల చెఱువు గ్రామంలో ఆత్మ సహకారంతో ఆయన రైతులకు శిక్షణ ఇచ్చారు. వాతావరణ మార్పుల వలన అకాల వర్షాలు, అనావృష్టి కరువు పరిస్థితులు, కొత్త చీడల బెడద ఎక్కువతున్నవన్నారు. మామిడి పూతలు ఆలస్యం కావడం, ఉద్యాన పంటలలో రసం పీల్చే పురుగులు, వైరస్ తెగులు అధికం కావడం వంటి సమస్యలకు వాతావరణ మార్పులే కారణం అని వివరించారు. అంతర పంటల సాగు, అధికంగా సేంద్రియ ఎరువు ల వాడకం ద్వారా ఈ సమస్యలను చాలావరకు తగ్గించవచ్చన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా నాణ్యమైన పంట వస్తుందని పుత్తూరు ఏడిఏ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో రైతులతోపాటు గ్రామ వ్యవసాయ సహాయకులు విష్ణు ప్రియ, మురళి యాదవ్, సుభాషిని, మోహన్ రమ్య, దివ్యమరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భూపతి, అయ్యప్ప నాయుడు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబును ఏకవాక్యంతో సంబోధించడం సరికాదు

రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి వారి గురువారెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: గత వైఎస్ ప్రభుత్వ హయాంలో హత్యా రాజకీయా లను ప్రోత్సహించిన జగన్మోహన్ రెడ్డి నేడు నెల్లూరు సెంట్రల్ జైల్ నందు మాచర్ల మాజీ శాసనసభ సభ్యులు పిన్నెల్ల రామకృష్ణారెడ్డిని పరామర్శించి, విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఏకవాక్యంతో సంబోధించడం సరైన పద్ధతి కాదని రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి వారి గురువారెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాల యం నందు పత్రికా సమావేశంను రెడ్డి వారి గురువారెడ్డి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి నేడు నెల్లూరు సెంట్రల్ జైలు వద్ద మాచర్ల నియోజకవర్గ మాజీ శాసనసభ సభ్యులు పిన్నెల్ల రామకృష్ణారెడ్డి పరామర్శించడానికి వచ్చి పాత్రికేయుల సమావేశం నిర్వహించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని చంద్రబాబు నాయుడు అంటూ ఏకపక్షంగా ప్రస్తావించడాన్ని ఖండించారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హత్య రాజకీయాన్ని ప్రోత్సహిస్తూ, రాష్ట్రంలో అనేక హత్యలకు కారణం అయ్యారని, అదేవిధంగా రౌడీయిజాన్ని ప్రోత్స హించిన ఘనత అలనాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని, అలాంటి వ్యక్తి నేడు నెల్లూరు సెంట్రల్ జైల్ నందు మాచర్ల మాజీ శాసనసభ సభ్యులు పిన్నెల్ల రామకృష్ణా రెడ్డిని పరామర్శించి, విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఏకవాక్యంతో సంబోధించడం సరైన పద్ధతి కాదని హితువు పలికారు. గత వైకాపా ప్రభుత్వంలో అధికారంలో ఉన్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబుని ఏవిధంగా ఇబ్బంది పెట్టారో స్మరించుకోవాలని తెలియజేశారు. కానీ నేడు ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్రంలో ఎక్కడ వైకాపా నాయకు లను ఇబ్బంది పెట్టకుండా ప్రజలకు సుపరిపా లన అందించడానికి, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, అలాంటి వ్యక్తిని ఏకపదంతో సంభోదించడం సరైన పద్ధతి కాదని, ఇలా మరోమారు సంభోదిస్తే వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాలుక కట్ చేస్తామంటూ హెచ్చరించారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్య మంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుని ఏ సభల్లో సమావేశాల్లో పాల్గొన్న నివ్వకుండా ఎటువంటి ఇబ్బందులు పెట్టారో ప్రజలంతా చూశారని, అయితే నేడు స్వచ్ఛమైన సుపరిపాలన అందజేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నెల్లూరులో విలేకరుల సమావేశం నిర్వహించిన ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు పెట్టకుండా ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి ప్రజాహక్కు వాక్ స్వాతంత్రం ఉంటుందనే ధ్యేయంతో నేడు జగన్మోహన్ రెడ్డిని ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు పెట్టలేదని, అలాంటి మహోన్నత వ్యక్తిపై నేడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అతని నోటికొచ్చినట్లు సంభోదించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇలా మరోమారు సంభోదిస్తే తెలుగుదేశం పార్టీ నాయకులు చూస్తూ ఊరుకోరని, తగిన మూల్యం చెల్లించవలసి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికే వైకాపా ప్రభుత్వానికి 11 సీట్లు ఇచ్చి ప్రజలు తమ వ్యతిరేకతను తెలియజేసిన జగన్మోహన్ రెడ్డికి ఆ విషయం అర్థం కావటం లేదని, మరో మారు ఇదేవిధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని సంభోధిస్తే, ఇక రానున్న రోజుల్లో ఆ 11 సీట్లు కూడా ప్రజలు ఆయనకు రావని సందర్భంగా గుర్తు చేశారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురువారెడ్డి తోపాటు టిఎన్‌టియుసి నియోజకవర్గం అధ్యక్షులు వెంకటేశ్వర చౌదరి, టిడిపి సీనియర్ దళితనాయకులు ధర పొందు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మంచినీటి పైపులైనుకు మరమ్మతులు

విశాలాంధ్ర-తడ : మండల కేంద్రమైన తడ కంద్రిగ రాజీవ్ నగర్ కాలనీలో గత మూడు నెలలుగా కలుషిత నీరు వస్తుందంటూ గగ్గోలు పెడుతుండగా గురువారం త్రాగునీటి పైపులైన్ పగుళ్ల వల్ల కలుషిత నీటి సరఫరా బాగోతం బయటపడింది వివరాల్లోకి వెళ్లగా గత మూడు నెలలుగా త్రాగు నీరు రంగు మారి కలుషితంగా వస్తున్నట్లు పలుమార్లు పంచాయతీ అధికారులకు మండల అధికారులకు తెలియపరిచిన కూడా ఎవరు పట్టించుకోక ఉదాసీనంగా వ్యవహరించారు. కానీ గురువారం ఉదయం రాజీవ్ నగర్లో వస్తున్న పైప్ నీట్ కుళాయిల్లో త్రాగునీటిలో మురుగునీరు కలుషితమై నల్లటి నీరు రావడంతో స్థానికులు వారికి అనుమానంగా ఉన్న ప్రదేశాన్ని పరిశీలించగా ఓ ఇంటి యజమాని త్రాగునీటి పైప్ లైన్ పై సెప్టిక్ ట్యాంక్ బరువుకి త్రాగునీటి పైప్ లైన్ కృంగడం వల్ల త్రాగునీరు కలుషితమైనట్లు బయటపడింది. వ్యర్థపు నీరు నిల్వ ఉండే ప్రదేశంలో జేసీబీ ద్వారా లోడి పరిశీలిస్తే సెప్టిక్ ట్యాంకు కింద నుండే త్రాగునీరు సరఫరాయి సరఫరా అయ్యే పైప్లైన్ వెళ్తున్నట్లు పంచాయతీ అధికారులు గుర్తించారు ఈ విషయాన్ని తెలుసుకున్న ఈఓ ఆర్డి అధికారి విజయకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని వెంటనే మరమ్మత్తులు నిర్వహించి త్రాగునీటి పైప్ లైన్ ను మార్చి త్రాగునీరు సరఫరా చేయాలని ఆదేశించారు సెప్టిక్ ట్యాంక్ను అక్కడినుండి తొలగించాలని అని ఇంటి యజమానికి సమాచారం ఇచ్చి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. మండల వైద్య అధికారులను అప్రమత్తం చేసి రాజీవ్ కాలనీలో మెడికల్ క్యాంపు ద్వారా దయారియా టెస్టులను కూడా నిర్వహించారు.

రాజధాని అమరావతి నిర్మాణం కొరకు విరాళం

విశాలాంధ్ర - కుప్పం: కుప్పం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ని కలిసి రాజధాని అమరావతి నిర్మాణం కొరకు విరాళం అంద జేస్తున్నట్లు విరాళానకు సంబంధించిన చెక్కును గుడిపల్లి మండలం పొగురు పల్లికి చెందిన ఎం.శంకర్ రెడ్డి 5116 రూపాయల చెక్కును జిల్లా కలెక్టర్ కి అం దజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వి. శ్రీనివాసులు, డ్వామా పిడి ఎన్.రాజశే ఖర్,కుప్పం ఆర్‌డిఓ శ్రీనివాసులు సంబంధిత అధికారులు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సత్కరించిన ఎస్ఎస్‌వి యూనియన్

విశాలాంధ్ర -తిరుపతి : ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ను శ్రీ శ్రీనివాస వ్యాన్ యూనియన్ ప్రతినిధులు సత్కరించారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే నివాసంలో టిడిపి నేతలు ఊక విజయ్ కుమార్, బిజి కృష్ణ యాదవ్ ల ఆధ్వర్యంలో వ్యాన్ యూనియన్ ప్రతినిధులు ఎమ్మెల్యే ను సత్కరించారు. తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ వి యూనియన్ నాయకులు అబ్దుల్ హయాద్, మునికృష్ణయ్య, దుర్గా రెడ్డి, బాలాజీ, నూరుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలిసిన ఎమ్మెల్యే పులివర్తి నాని

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : తిరుపతి జిల్లా నూతన కలెక్టర్ గా గురువారం పదవి బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మండల నాయకులతో కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి శు భాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గం గత పది సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోలేదని అన్ని విధాల వెనుకబడి ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. చంద్రగిరి నియోజకవర్గంలో తాజా మాజీ ఎమ్మెల్యే ప్రకృతి వనరులను దోచుకోవడంలో చూపిన శ్రద్ధ అభివృద్ధి పైన చూపలేదని కలెక్టర్ ముందు వాపోయారు.రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, విద్యా వ్యవస్థ కుంటుపడిందని, పంచాయతీలను నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. పలు పంచాయతీలను వేరే పంచాయతీలతో విలీనం చేయటంతో పరిపాలన పూర్తిగా దెబ్బతినిందని, అభివృద్ధి కుంటుపడిందని వివరించారు.మీరు చేపట్టే సుపరిపాలనకు తాము సహకారం అందిస్తామని చెప్పారు. ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో అధికారులకు పూర్తిగా మద్దతు ఇస్తామని ఎమ్మెల్యే పులివర్తి నాని స్పష్టం చేశారు.జిల్లాలో పరిపాలనను స్పష్టమైన గాడిలో పెట్టగలరని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు.వెనుకబాటు తనానికి గురి అయిన చంద్రగిరి ని అభివృద్ధి చేయడానికి చేయూతను అందివ్వాలని ఎమ్మెల్యే పులివర్తి నాని కలెక్టర్ కి విజ్ఞప్తి చేశారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి

విశాలాంధ్ర - పలమనేరు : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127 వ జయంతి సందర్భంగా తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కళామందిరంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు వి తులసినాథంనాయుడు మాట్లాడుతూ నేటి యువత అల్లూరిని స్ఫూర్తిగా తీసుకుని దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, భారతి ,కుమారి, యశస్విని, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి 77వ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - వెంకటగిరి : శ్రీకృష్ణదేవరాయ కాపు బలిజ తెలగ. ట్రస్ట్ వెంకటగిరి. వారి ఆధ్వర్యంలో శ్రీ వంగవీటి మోహన్‌రంగా 77జన్మదిన వేడుకలు చాలా దిగ్విజయంగా జరిగినాయి ఈ కార్యక్రము ఆల్ ఇండియా రాయల్ కాపు జనరల్ సెక్రెటరీ తోట కృష్ణయ్య ఆధ్వర్యంలో జరుగబడినవి ఈ కార్యక్రమా నికివిశ్రాంతి ప్రిన్సిపాల్ అయినటువంటి బికే ప్రసాద్ గారుఅధ్యక్షత వహించగా జోతేశ్వరరావుతిరుపాల్ తిరుపతి ప్రసాద్ రాజామరియు ఆనంద, టోని బాబుమిగిలిన రంగా అభిమానులు కాపుసోదరులు జనసేన కార్యకర్తలుఅందరూ హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో విద్యా వ్యవస్థ నిర్వీర్యం

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.శశికుమార్ ధ్వజం

గూడూరులో విద్యా సంస్థల బంద్ సక్సెస్

విశాలాంధ్ర - గూడూరు : ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్ యూ, విద్యార్థి సంఘాల పిలుపు మేరకు దేశ వ్యాప్త కేజీ నుండి పీజీ విద్యా సంస్థల బంద్ గూడూరులో గురువారం సూపర్ సక్సెస్ అయింది. పట్టణంలో ప్రయివేటు కళాశాలలు, పాఠశాలలు స్వచ్ఛందంగా మూసివేశారు. ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థి సంఘాల నాయకులు మూసివేయించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జీ. శశి కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ చర్యలతో దేశంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం అయిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్షలలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించి అందుకు బాధ్యులైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న విద్యా విధానాలతో విద్యా ర్థుల భవిష్యత్తు అంధకారంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా నీట్ పరీక్షల నిర్వహణలో అవినీతి చోటు చేసుకోవడం దారుణమన్నారు. ఎన్టీఏ వ్యవస్థను రద్దు చేయాలన్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీ నామా చేయాలన్నారు. ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థు లకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలన్నారు. పీహెచ్డీ అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షలు రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించా లన్నారు. ముంబై ఐఐటి నుండి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు విద్యార్థి సంఘ నేతలపై అక్రమ కేసులు, నిర్బంధాలు యూనివర్సిటీలో ప్రజాస్వామ్య అణిచివేత చర్యలు ఆపాలన్నారు. దేశవ్యాప్తంగా పాఠశాలల మూసివేతను ఆపాలన్నారు. నీట్ పరీక్షా విధానాన్ని రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. ఆయా డిమాండ్లను పరిష్క రించని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీను, సుజిత్, పవన్, మనోజ్, కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రుయా అసిస్టెంట్ డైరెక్టర్ అడ్మిన్‌కు

ఘనంగా సన్మానం

విశాలాంధ్ర - తిరుపతి : రుయా హాస్పిటల్లో అసిస్టెంట్ డైరెక్టర్ అడ్మిన్‌గా బాధ్యతలు స్వీకరించిన ముని రమేష్ ను గురువారం ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని రుయా హాస్పిటల్ హెల్త్ ఇన్స్పెక్టర్ కె..ఆర్. ప్రకాష్ పుష్పగుచ్ఛా లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం. ఎన్ .ఓ. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సాగరమాల రహదారి పనులను అడ్డగించిన రైతులు

విశాలాంధ్ర-చిల్లకూరు: మోమిడి రెవిన్యూ, వరగలి గ్రామపరిధిలోని సర్వే నంబరు 636/%, 636/1 లలోని 5.56 ఎకరముల భూమిని ప్రభుత్వం వారు సాగరమాల రహదారి పనుల నిమిత్తం, రహదారి నిర్మాణం కొరకు సేకరణ జరిపి రహదారినిర్మాణం పనులను చేపట్టారు. కానీ భూములకు సంబంధించిన హక్కులు కలిగి ఉన్న వారికి నష్టపరిహారం నగదు చెల్లింపు జరవక పోవడంతో , గురువారం స్థానిక యంపిటిసి మరియు భూముల యజమాని దారా కోటేశ్వరరావు ఆధ్వర్యంలో రహదారి నిర్మాణం పనులు అడ్డగించడం జరిగింది. పలువురు భూములను నష్టపోయిన రైతులు ఆందోళన లో పాల్గొన్నారు. ధర్నానిర్వహించారు. సర్వే నంబరు 59 లో కూడా పరిహారం చెల్లింపు జరగలేదని రైతులు ఆగ్రహంవ్యక్తంచేశారు. విఆర్ వో, ఆర్ఐ , తహశీల్దార్ తగుచర్యలు తీసుకోవాలని భాదిత రైతులు కోరారు. గూడూరు ఆర్డీఓ కిరణ్ కుమార్ ఈ సమస్యపై స్పందించి తమకు న్యాయంచేయాలని భాదితరైతులు కోరుతున్నారు.

తిరుపతిలో పిఎన్జి కార్యకలాపాలు ప్రారంభం

విశాలాంధ్ర -తిరుపతి: స్వచ్ఛమైన, సమర్ధవంతమైన వంట గ్యాస్ ని అందించే సౌలభ్యాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకున్న, భారతదేశంలోని ప్రముఖ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ అయిన ఏజిపి ప్రథమ్ , తిరుచానూరులోని వైష్ణవి నగర్‌లో ఉన్న ఎడిఫై స్కూల్ కిచెన్‌కి తమ తొలి వాణిజ్య పి ఎన్ జి కనెక్షన్ ద్వారా గ్యాస్ సరఫరాని ప్రారంభించింది .ఈ కార్యక్రమంలో ఎడిఫై స్కూల్ చైర్మన్ ప్రణీత్ తో పాటు ఏజిపి ప్రథమ్ సంస్థకు చెందిన సీనియర్ మేనేజ్‌మెంట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ సంస్థ రీజినల్ హెడ్ గౌతమ్ ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంకు అనుగుణంగా ఏజిపి ప్రథమ్ సంస్థ ప్రయత్నం చేస్తోంది. స్వచ్ఛమైన వంట గ్యాస్ ని నిరంతర సరఫరా చేయడానికి , ఏజిపి ప్రథమ్ సంస్థ తిరుత్తణి నుండి తిరుపతికి ట్రంక్ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది, ఇది తిరుపతిలోని ప్రధాన పారిశ్రామిక, వాణిజ్య మరియు గృహ వినియోగదారులకు ఈ గ్యాస్‌ను అందిస్తుందన్నారు. వంట గ్యాస్ వినియోగాల విషయంలో తిరుపతి నగరం, పర్యావరణ అనుకూలమైన వంట గ్యాస్ పద్ధతులను అవలంబించడం చాలా గొప్ప విషయం. ఎడిఫై పాఠశాల మరియు ఏజి%ఉ%పి ప్రథమ్ సంస్థల మధ్య ఈ సహకారం తిరుపతి జిల్లాలో పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహించడంలో సంస్థ నిబద్ధతను వెల్లడిస్తుందన్నారు. పిఎన్జి కనెక్షన్లు పూర్తిగా సురక్షితమైనవి. ఎల్పిజి సిలిండర్ ఖర్చుతో పోలిస్తే 20-30% వరకూ డబ్బు ఆదా చేసుకోవచ్చు " అని అన్నారు పి ఎన్ జి కనెక్షన్‌ని పొందేందుకు ఆసక్తి ఉన్న కస్టమర్లు ఏజి%ఉ%పి ప్రథమ్ సంస్థ కస్టమర్ కేర్ నంబర్‌ను 1800 2022 999 సంప్రదించాలని కోరారు.

అల్లూరి జీవితం అందరికీ ఆదర్శం

: కమిషనర్ అదితిసింగ్

విశాలాంధ్ర -తిరుపతి : అల్లూరి సీతారామరాజు జీవితం అందరికి ఆదర్శ ప్రాయమని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం అల్లూరి చిత్రపటానికి పూలమాలతో అలంకరించి, అధికారులు, కార్పొరేటర్లు కొబ్బరి కాయలు కొట్టి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ అదితిసింగ్ మాట్లాడుతూ మన్యం ప్రజల స్వాతంత్ర్య కోసం బ్రిటీష్ వారిపై పోరాడిన అల్లూరి స్ఫూర్తిని అందరూ గుర్తుంచుకున్నారని, స్వాతంత్ర్య కోసం పోరాడిన మహానుభావులను స్మరించుకోవాల్సిన అవసరం వుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆర్.సి.మునికృష్ణ, కోటూరి ఆంజినేయులు, వరికుంట్ల నారాయణ, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, రెవెన్యూ ఆఫీసర్లు కె.ఎల్.వర్మ, సేతుమాధవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

భావి భారత పౌరులకు విప్లవ స్ఫూర్తి అల్లూరి సీతారామరాజు

– సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య

విశాలాంధ్ర -తిరుపతి : భావి తరాలకు విప్లవ స్ఫూర్తి అల్లూరి సీతారామరాజు అని అల్లూరి సీతారామరాజు స్ఫూర్తి తో ప్రజా వ్యతిరేక మతోన్మాద విధానాలపై పోరాడాలని భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య పిలుపు నిచ్చారు. గురువారం సీపీఐ , ఎఐఎస్ఎఫ్ ఆధ్వ ర్యంలో తిరుపతి బైరాగి పట్టెడ లోని సీపీఐ కార్యాలయం లో మన్యం విప్లవ వీరులు అల్లూరి సీతారామరాజు 127 వ జయంతి సందర్భంగా అల్లూరి చిత్ర పటానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచ లయ్య, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి , అభ్యుదయ వేదిక జిల్లా అధ్యక్షులు గురవయ్య పూల మాలలు వేసి ఘనంగా నివా ళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం, స్వయం పాలన కోసం తన ప్రాణాలను ఫణంగా పెట్టి బ్రిటీష్ పరాయి పాలకు లతో పోరాడిన అల్లూరి సీతారామరాజు త్యాగం గొప్పదని, స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఎందరికో స్ఫూర్తి కలిగించిన ఆయన అమరత్వం అజరామరమని నిస్వార్థ స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర్య చరిత్రలో ఒక మహోన్న తమైన శక్తి. భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు. మన్యం వీరుడు, అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు అన్నారు. ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్య పోరాటం కోసం 27 ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన గొప్ప వీరుడు అని తెలిపారు. రెండు సంవత్సరాల పాటు బ్రిటీష్ వారికి కంటినిండా కునుకు లేకుండా గడగడలాడించిన వ్యక్తి అల్లూరి సీతారా మరాజు అని అన్నారు. నిరక్షరాస్యులు, నిరుపేదలు, అమాయకు లయిన అనుచరులతో, చాలా పరిమిత వనరులతో బ్రిటీషు సామ్రాజ్య మనే మహా శక్తిని ఢీకొన్న మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు. ఆంగ్లేయులకు ఎదురు నిలబడి పోరాడి, తెల్ల దొరల తలలు తిరిగేలా చేసిన వీరుల్లో తెలుగు గడ్డ మీద పుట్టిన బిడ్డ అల్లూరి సీతారామరాజు ఒకరన్నారు. అడవినైనా తగల బెట్టేందుకు నిప్పు రవ్వ చాలన్నట్లుగా ఒక్కడే సైన్యాన్ని నిర్మించుకుని ఉద్యమ బాట సాగించారని, ఆంగ్లేయుల అరాచకాలకు ఎదురొడ్డి గిరిజన బిడ్డలకు అండగా నిలిచారని చివరికి బ్రిటీష్ వారి చేతికి చిక్కి అమరుడయ్యా రన్నారు. నిర్లక్ష్యాన్ని గురైన జాతుల అభ్యున్నతి కోసం మన్య వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటాన్ని త్యాగాన్ని అందరూ స్ఫూర్తిగా తీసుకొని నేడు మోడి గిరిజనుల సంపద ను కార్పొరేటర్లకు దోచిపెడుతున్న విధానానికి సమాజంలో జరుగుతున్న అసమానతలపై , ప్రజా వ్యతిరేక విధానాలపై యువత అల్లూరి సీతా రామరాజు స్ఫూర్తి తో పోరాడదాం అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి జె విశ్వనాథ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రాధాకృష్ణ , ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పండి చలపతి, అభ్యుదయ వేదిక జిల్లా అధ్యక్షులు గురవయ్య, జిల్లా కార్యదర్శి యం డి ప్రసాద్, అఖిల భారత యువజన సమాఖ్య ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు యం రామకృష్ణ , ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి జె నాగరాజు, నాయకులు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్య దర్శులు నవీన్, ప్రవీణ్ , నగర నాయకులు నాగరాజు, మునేశ్వర్, శివా సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ముక్కంటి ప్రసాదాలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తిరుపతి కలెక్టరుగా బాధ్యతలు చేపట్టిన ఎస్.వెంకటేశ్వర్ కు గురువారం శ్రీకాళహస్తి పురపాలక సంఘం కమిషనరు ముప్పాళ్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకు మునుపు ముక్కంటి శేషవస్త్రంతో కలెక్టరు వెంకటేశ్వర్ ను సన్మానించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్ పెక్టరు శ్రీనివాసులు, ఆర్.ఐ. బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

టాస్క్ ఫోర్సులో ఘనంగా

అల్లూరి సీతారామరాజు జయంతి

విశాలాంధ్ర -తిరుపతి : ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్సు కార్యాలయంలో గురువారం అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ అల్లూరి చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. తరువాత ఆయన మాట్లాడుతూ అన్యాయం, దోపిడీలపై అల్లూరి సీతారామరాజు పోరాటం చేశారని అన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చూపిన ధైర్య సాహసాలు యువతరానికి స్ఫూర్తినిస్తాయని తెలిపారు. అల్లూరి పోరాట స్ఫూర్తితో టాస్క్ ఫోర్సు పోలీసులు పని చేయాలని, అడవుల్లోకి చొరబడుతున్న ఎర్రచందనం స్మగ్లర్లను నిరోధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చెంచుబాబు, ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, సీఐలు శ్రీనివాస్, సురేష్ కుమార్, ఎస్ఐ రఫీ, ఎఫ్ఆర్ఓలు మురళీకృష్ణ, ప్రేమ, ఆర్ఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొని అల్లూరికి నివాళులర్పించారు.

ఆలయ అధికారులూ... ఇది గమనించారా...?

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ముక్కంటి క్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాల యంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి రెండు కళ్లున్నా.. ఒక కంటితో కూడా పని చేయడం లేదు అనేందుకు అనేక ఉదా హరణ లున్నాయి. గత ప్రభుత్వ హయా ంలో ఆలయంలో అన్నిచోట్ల అందిన కాడికి దోచుకునే కార్యక్రమాలు చాలానే జరిగాయి. అయితే అంతా పారదర్శకమని అటు నాయకులు, ఇటు అధికారులు బుకాయించేవారు. ఆలయానికి సంబంధించిన నాలుగు గోపురాలు వద్ద నాలుగు దుకాణాలను కొందరు ఏర్పాటు చేశారు. అప్పటి ధర్మకర్తల మండలిలోని ఇద్దరు సభ్యులు, ఒక ఔట్ సోర్సింగ్ ఉద్యోగి వీటిని ఏర్పాటు చేయడం బహిరంగ రహస్యమే. పూజా సామగ్రితో పాటు వివిధ రకాల వస్తువుల అమ్మకాలు జరిగాయి. ఆలయ దుకాణంలో లేని వస్తువులు కూడా ఇక్కడ విక్రయించడం విశేషం. అయితే గత పది రోజులుగా దుకాణాలు మూతపడ్డాయి. ముఖ్యంగా భక్తులు రాకపోకలు సాగించే సుపథం మండపంలో ఒక దుకాణాన్ని ఏర్పాటు చేశారు. గత పది రోజులుగా ఈ దుకాణం మూతపడి ఉంది. భక్తులకు ఎంతో ఇబ్బంది కలిగించే ప్రాంతంలో ఏర్పాటు చేసిన దుకాణం మూతబడినా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకో వడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ంతో వ్యాపా రం సాగించేవారు ధర్మకర్తల మండలిలో ఉండకూడదు. అదేవిధంగా ఉద్యోగులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులు కూడా ఆలయంలో వ్యాపారాలు చేయకూ డదు. అయినా నిబంధనలకు వ్యతిరేకంగా అన్నీ జరి గాయి. అయినా సభ్యుల పైన చర్యలు లేవు. ఉద్యోగిని అధికారులు కనీసం సంజాయిషీ అడగడానికి కూడా తటపటాయించే దుస్థితి. గత నెల ఉద్యోగ విరమణ చేసిన ఈవో నాగేశ్వరరావు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ నెల ఒకటో తేదీ నుంచి తిరుపతి ఆర్ జె సి ఎస్వీఎస్ఎన్ మూర్తి పూర్తి అదనపు బాధ్యతలతో ఉన్నారు. ఆయన కూడా దీనిపై చర్యలు తీసుకుంటారా లేదా అనేది వేచి చూడాలి. నిబంధనలకు విరుద్ధంగా ఆలయ ఉద్యో గి ప్రత్యక్షంగా వ్యాపారంలో జోక్యం చేసుకోవడం... కుటుంబ సభ్యు ల పేరుతో దుకాణం ఉండడం... అధికారులకు సిబ్బందికి తెలిసినా సమర్థించడం ఎంతవరకు సమంజసమో...? శివయ్యా చూడవయ్యా.

సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలి

– టిడిడి ఈఓ శ్యామలరావును కలిసిన ఎమ్మెల్యే పులివర్తి నాని

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : తిరుమల తిరుపతి దేవస్థానం కార్య నిర్వాహణ అధికారి శ్యామల రావుని చంద్రగిరి ఎమ్మె ల్యే పులివర్తి నాని, నియోజక వర్గంలోని మండల నాయకులతో కలిసి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు.పులివర్తి నాని ఈవో కి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దైవ దర్శనంలో చొరబడి ఉన్న దళారీలను ఏరివేయాలని, సామాన్య భక్తుల కు పెద్దపీట వేయాలని కోరారు. ప్రపంచ వ్యాప్తంగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధి తిరుమల గురించి ఎంతో ప్రాశస్త్యం ఉండేదని, గత ప్రభుత్వం హయాంలో దానికి కొంచెం మరకలు బారాయని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలోని అన్నీ శాఖలలో ప్రక్షా ళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రగిరి నియోజక వర్గంలోని శ్రీవారి మెట్టు మార్గంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. శ్రీనివాస మంగాపురంలో మాస్టర్ ప్లాన్ రూపొందించి అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే పులివర్తి నాని ఈవోకు విన్నవించారు. చంద్రగిరి నియోజక వర్గంలోని దేవాలయాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. చంద్రగిరి నుంచి శ్రీనివాస మంగాపురం వరకు ఉన్న రహదారిని టీటీడీ నిధులతో అభివృద్ధి చేయాలని తెలిపారు. టీటీడీ తీసుకునే ప్రతి నిర్ణ యానికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తా మని పులివర్తి నాని అన్నారు. ఎన్నిక లకు ముందు తరువాత వలు సమస్యలను రోజు కూలీలు వివరించి నట్లు... సమస్యల పరిష్కారానికి ఈఓ శ్యామల రావును కోరారు. అందరం కలిసి తిరుమల పవిత్రతను కాపాడుదాం అన్నారు.

విశాలాంధ్ర అక్షరాక్షరం అభ్యుదయం
విలేకరులు కావలెను
విశాలాంధ్ర తెలుగు జాతీయ దినపత్రికలో చిత్తూరు, తిరుపతి జిల్లాలో
దిగువ తెలిపిన మండలాల్లో పనిచేయుటకు స్థానికంగా ఉన్న అభ్యర్థులు కావలెను.
ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, తెలుగుభాషపై పరిజ్ఞానం ఉండాలి.
పనిచేయవలసిన మండలాలు :
తిరుపతి సిటి, వడమాలపేట, నగరి, నాగలాపురం, గూడూరు, డక్కిలి,
రామచంద్రాపురం, పులిచెర్ల, రొంపిచెర్ల, ఎర్రవారిపాలెం, సదుం, యాదమరి,
బంగారుపాలెం, ఐరాల, పూతలపట్టు, శాంతిపురం, గుడుపల్లె
గమనిక: ఆయా మండలాల్లో స్థానికులై ఉండాలి
సంప్రదించవలసిన నెంబరు: 9490952134